
క్లుప్తంగా

కలాం జాతీయ పురస్కారానికి ఎంపిక


గంగాధరం

గంగాధర నెల్లూరు : మండలంలోని అక్కనగారిపల్లి ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్న గంగాధరం ఏపీజే అబ్దుల్ కలాం జాతీయ అవార్డుకు ఎంపిక అయ్యారు. సోమలరాజు ఫౌండేషన్ తరపున 14వ తేదీ అన్నమయ్య జిల్లా రాయచోటిలో జరగనున్న జాతీయస్థాయి సమావేశంలో ఈ అవార్డును గంగాధరానికి ప్రదానం చేయనున్నట్లు మండల విద్యాశాఖ అధికారులు తెలిపారు.

అంగన్‌వాడీ ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

కార్వేటినగరం : కార్వేటినగరం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ ఉద్యోగాలకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సీడీపీఓ పద్మసునంద పేర్కొన్నారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ.. ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని శ్రీరంగ రాజపురం మండలం సీకే పురం అంగన్‌వాడీ కేంద్రంలో హెల్పర్ (బీసీ–బీ), అలాగే కార్వేటినగరం మండలం ఆర్కేవీబీపేట అంగన్‌వాడీ కేంద్రంలో హెల్పర్(బీసీ–బీ) ఖాళీలను భర్తీ చేయడానికి నోటిఫికేషన్ విడుదల చేయడం జరిగిందన్నారు. అర్హులైన వారు ఈనెల 22వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు దరఖాస్తులను సీడీపీఓ కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

ఉపాధిహామీ ఏపీఓగా బాలమురళి

నింద్ర : జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం మండల ఏపీఓగా బాలమురళి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. రోంపిచర్ల మండలంలో పని చేస్తున్న ఈయన నింద్రకు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో ఉపాధి పనులు సక్రమంగా అమలయ్యేటట్లు చూస్తానని, అలాగే సకాలంలో పథకం పనులు పూర్తి చేస్తామని తెలిపారు.

ఆకతాయిల చేష్టలపై ఆగ్రహం


రైతు సేవా కేంద్రం గోడలకు రాసిన టీడీపీ, జనసేన పేర్లు

శ్రీరంగరాజపురం : మండలంలోని వి.వి.పురం పంచాయతీలో ప్రజల సౌకర్యార్థం ప్రభుత్వం లక్షలు ఖర్చు చేసి సచివాలయం ,రైతు సేవా కేంద్రం, విలేజ్ హెల్త్ క్లినిక్‌లు నిర్మిస్తే టీడీపీ , జనసేనకు చెందిన కొంత మంది ఆకతాయిలు ప్రభుత్వ భవనానికి టీడీపీ, జనసేన అని గోడపై రాశారు. ఇంత జరుగుతున్నా సచివాలయం సిబ్బంది, ఎంపీడీఓ వీటిపై చర్యలు తీసుకోకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఎక్కడి పనులక్కడే !

ఇంటి వద్దకే ప్రభుత్వ సేవలు నడిసొచ్చేలా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సరికొత్త ఒరవడిని తీసుకొచ్చింది. బర్త్ సర్టిఫికెట్ నుంచి డెత్ సర్టిఫికెట్ వరకు ఇంటి నుంచి కాలు కదపకుండా సచివాలయాల వ్యవస్థను పల్లెలకు పరిచయం చేసింది గత జగన్ ప్రభుత్వం . ఈ సేవలకు అనుగుణంగా ప్రతి పంచాయతీలోనూ ప్రభుత్వ భవనాలను నిర్మించి పల్లె ప్రజల్లో భరోసా నింపింది. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కనీసం 70 శాతం పూర్తయిన భవనాలను సైతం పూర్తి చేయలేక చతికిలపడింది.

- కూటమి పాలనలో ముందుకు సాగని నిర్మాణాలు
- సచివాలయం, ఆర్‌బీకే, హెల్త్ సెంటర్ పనులకు బ్రేక్
- సొంత భవనాలు లేక ప్రజల ఇబ్బందులు

శ్రీరంగరాజపురం : గ్రామ స్వరాజ్యమే లక్ష్యంగా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అడుగులు వేసింది. జిల్లా , మండల కేంద్రాల చుట్టూ తిరగాల్సిన పని లేకుండా ప్రజల సౌకర్యార్థం గ్రామాల్లోనే సచివాలయం , ఆర్‌బీకే, హెల్త్ సెంటర్, డిజిటల్ లైబ్రరీ వంటి భవన నిర్మాణాలకు పెద్దపీట వేసింది. ఇప్పటి వరకు గంగాధర నెల్లూరు నియోజకవర్గంలో దాదాపు 70 శాతం భవన నిర్మాణ పనులను పూర్తి చేసి వినియోగంలోకి తెచ్చింది. మిగిలిన 30 శాతం భవన నిర్మాణ పనులు పూర్తి చేసే దిశగా కూటమి ప్రభుత్వం చొరవ చూపకపోవడంతో అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి.


అసంపూర్తిగా దర్శన మిస్తున్న విలేజ్ హెల్త్ క్లినిక్


శ్రీరంగరాజపురంలో అసంపూర్తిగా సచివాలయం

అందుబాటులో సేవలు

ప్రజలు వివిధ పనుల నిమిత్తం వ్యయ ప్రయాసల కోర్చి మండల, జిల్లా కార్యాలయాలకు వెళ్లాల్సి వచ్చేది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను తెచ్చి ఒక్కో సచివాలయంలో 11 శాఖల సిబ్బందిని నియమించింది. 35 ప్రభుత్వ శాఖలకు చెందిన 500 పైగా సేవలను అందుబాటులోకి తీసుకొచ్చింది.ఒక్కో సచివాలయానికి రూ.40 లక్షలు , రైతు భరోసాకు రూ.21.8 లక్షలు, హెల్త్ సెంటర్‌కు రూ.25 లక్షలు, డిజిటల్ లైబ్రరీ, పాల కేంద్రాలకు రూ.15.75 లక్షల చొప్పున మంజూరు చేసింది. ఇందులో దాదాపు గత పాలనలో 70 శాతం పనులు పూర్తి చేశారు. మిగిలిన 30 శాతం పనులు చేయకపోవడంతో అసంపూర్తి దశలోనే శిథిలావస్థకు చేరుకొనే ప్రమాదం నెలకొంది.

చొరవ చూపని ప్రభుత్వం

గత ప్రభుత్వంలో ఆయా భవన నిర్మాణాలు శరవేగంగా సాగాయి. ప్రస్తుతం భవన నిర్మాణ పనులు మందకొడిగా సాగుతున్నాయి. మరి కొన్నిచోట్ల అసలు పనులు ముందుకు సాగడం లేదు. వీటి నిర్మాణాలు పూర్తి చేసే దిశగా ప్రభుత్వం చొరవ చూపకపోవడంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. త్వరితగతిన వీటిని పూర్తి చేసి వినియోగంలోకి తీసుకు రావడం ద్వారా ప్రజలకు మెరుగైన సేవలందించేందుకు కూటమి ప్రభుత్వం చొరవ చూపాలని ప్రజలు కోరుతున్నారు.

అకౌంటింగ్‌లో పెరిగిన ఉద్యోగ అవకాశాలు

పుత్తూరు: అకౌంటింగ్ రంగంలో ఉద్యోగ అవకాశాలు గణనీయంగా పెరిగాయని వాణిజ్య శాస్త్ర విభాగం అధ్యక్షురాలు డాక్టర్ దేవకి తెలిపారు. మంగళవారం స్థానిక ఎస్‌ఆర్‌ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ అకౌంటింగ్ దినోత్సవాన్ని నిర్వహించారు. దేవకి మాట్లాడుతూ.. వ్యాపార రంగంలో పారదర్శకత, ఉత్పాదకతను పెంచడంలో అకౌంట్స్ కీలకమని తెలిపారు. అకౌంటింగ్ అభివృద్ధి చెందుతున్న రంగమని, ఆర్థిక నిర్వహణలో విజయం సాధించడానికి తోడ్పడుతుందన్నారు. గతంలో కంప్యూటర్లు, కాలిక్యులేటర్లు లేవని అయినా వాణిజ్య పరమైన లెక్కలను గణికులు అవలీలగా వేసే వారని తెలిపారు. రూపాయి విలువను విదేశీ కరెన్సీలతో లెక్క గట్టడం, నిత్య జీవితంలో అకౌంటింగ్ ప్రాధాన్యతను వివరించారు. అనంతరం విద్యార్థులకు ఆన్‌లైన్ క్విజ్ , వ్యాస రచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు వాసవి, తిరుమలయ్య, గంగయ్య, శ్రీనివాసులు, లక్ష్మీబాయి, జ్యోతి, నాగరాజ్ పాల్గొన్నారు.


విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న డాక్టర్ దేవకి

తిరుమలరాజుపురంలో జోరుగా సారా విక్రయాలు

పాలసముద్రం : మండలంలోని తిరుమలరాజుపురంలో జోరుగా నాటుసారా విక్రయాలు సాగుతున్నాయని గ్రామ ప్రజలు ఆరోపిస్తున్నారు. తిరుమళరాజుపురం ఉన్నత పాఠశాల మైదానం సమీపంలోని కుంట పక్కన సారాను ప్లాస్టిక్ కవర్‌లో ప్యాక్ చేసి ట్యాంకు సమీపంలో విక్రయిస్తున్నారని కార్వేటినగరం ఎక్సైజ్ శాఖ పోలీసులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. హైస్కూల్ విద్యార్థినులు వెళుతుంటే రోడ్డు పక్కనే సారా విక్రయాలు చేస్తుండడంతో వారు భయాందోళన చెందుతున్నారు. కొన్ని సమయాల్లో మత్తు ఎక్కువ అయినప్పుడు విద్యార్థులను నానా బూతులు తిడుతున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. సాయంత్రం అయితే రోడ్డులో నాటు సారా తాగి విచ్చలవిడిగా తిరుగుతున్నారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నత స్థాయి అధికారులు స్పందించి తిరుమళరాజుపురం దళితవాడలో నాటు రాను అరికట్టాలని కోరుతున్నారు.


సారాను గ్లాసులో పోస్తున్న దృశ్యం

సారా స్వాధీనం : వ్యక్తి అరెస్టు


రాజుల కండ్రిగలో పట్టుబడిన నాటుసారాను చూపుతున్న పోలీసులు

కార్వేటినగరం : అక్రమంగా అమ్మకానికి సిద్ధంగా ఉంచిన 50 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకొని వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎక్సైజ్ ఎన్‌ఫోర్సుమెంట్ సీఐ జవహర్‌బాబు తెలిపారు. మంగళవారం కార్వేటినగరం ఎక్సైజ్ కార్యాలయ ఆవరణలో నిందితుడి అరెస్టు చూపించారు. ఈ సందర్భంగా ఎస్ఐ పృథ్వి మాట్లాడుతూ.. మండల పరిధిలోని రాజులకండ్రిగ దళితవాడలో దాడులు నిర్వహించి పొన్నుస్వామి ఇంటిలో అమ్మకానికి సిద్ధం చేసిన 50 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. గ్రామాల్లో నాటు సారా తయారీ, అమ్మకాలు జరుగుతున్నట్లు తెలిసిన వెంటనే ఎక్సైజ్ అధికారులకు సమాచారం అందించాలని, వారి పేర్లను గోప్యంగా ఉంచుతామన్నారు. కార్యక్రమంలో సీఐ సుబ్రహ్మణ్యం, సిబ్బంది మునిసుందరం, కృష్ణయ్య, విజయ్, హేమాద్రి, రాజ్‌దీప్ పాల్గొన్నారు.

సారా స్థావరాలపై దాడులు

కార్వేటినగరం : సారా స్థావరాలపై దాడులు నిర్వహిస్తున్నామని ఎస్ఐ రాజ్‌కుమార్ తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని గోపిశెట్టిపల్లి గ్రామ సమీపంలోని చెరకు తోటలు, అటవీ ప్రాంతాల్లో దాడులు నిర్వహించి సారా తయారీకి సిద్ధం చేసిన 200 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. అనంతరం ఎస్ఐ మాట్లాడుతూ.. అక్రమంగా నాటు సారా తయారీ, అమ్మకాలు జరపడం చట్టరీత్యా నేరమన్నారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా సారా తయారీలు చేసిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి రిమాండుకు తరలించడమే కాకుండా భారీగా జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. గ్రామాల్లో అక్రమ సారా అమ్మకాలు, తయారీ చేపడుతున్నట్లు తెలిసిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.


బెల్లం ఊటను ధ్వంసం చేస్తున్న పోలీసులు

చెరుకు రైతుల సమస్యలపై మంత్రికి వినతి

నింద్ర : మండలంలోని నేతమ్స్ షుగర్ ఫ్యాక్టరీ చెరుకు రైతుల సమస్యను పరిష్కరించాలని ఫ్యాక్టరీ చెరకు రైతు సంఘం నేతలు మంగళవారం రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి అచ్చెంనాయుడుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ఫ్యాక్టరీ ఇవ్వాల్సిన బకాయిలు రైతులకు ఇవ్వాలని , అదే విధంగా ఫ్యాక్టరీ కొనసాగించాలని కోరారు. ఫ్యాక్టరీ మూత పడడం వలన రైతులు పడుతున్న బాధలను మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. ఈ కార్యక్రమంలో చెరకు రైతు సంఘం నాయకులు సతీష్‌నాయుడు, నారాయణస్వామి నాయుడు, గజేంద్రరెడ్డి, మురళినాయుడు పాల్గొన్నారు.

నేటి నుంచి వేరుశనగ విత్తనాల పంపిణీ

నింద్ర : మండలంలోని రైతులకు రబీకి సంబంధించిన వేరుశనగ విత్తనాలు నేటి నుంచి మండలంలో పంపిణీ చేస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి తులసీరాం పేర్కొన్నారు. మండలంలో మొత్తం 550 క్వింటాళ్ల విత్తనాలు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. కావాల్సిన రైతులు బస్తా (30 కిలోలు) రూ.1,728 రూపాయలకు పంపిణీ చేస్తున్నామన్నారు. మండలంలోని రైతు భరోసా కేంద్రాల్లో పంపిణీ జరుగుతోందని కావలసిన రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

డిప్యూటీ తహసీల్దార్‌గా రవీంద్రబాబు

శ్రీరంగరాజపురం : మండల డిప్యూటీ తహసీల్దార్‌గా రవీంద్రబాబు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో నెలకొన్న రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. మండల వ్యాప్తంగా జరుగుతున్న రీసర్వేను వేగవంతం చేస్తానని తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

నగరి : మున్సిపల్ పరిధి ఏకాంబరకుప్పం రైల్వేస్టేషన్ సమీపంలో దిగువ రైలు మార్గంలో గుర్తు తెలియని వ్యక్తి రైలు ప్రమాదంలో మృతి చెందినట్లు రైల్వే ఎస్ఐ రవి తెలిపారు. ఆయన కథనం మేరకు మృతునికి 35 ఏళ్ల వయసు ఉంటుంది. సన్న గీతల డిజైన్ లైట్ పింక్ ఆఫ్ షర్టు, బ్లూ వైట్ గళ్ల లుంగీ ధరించి ఉన్నాడు. గొంతు వద్ద నల్లటి పుట్టుమచ్చ కలిగి ఉన్నట్లు ఎస్ఐ తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 99631 26343ను సంప్రదించాలన్నారు.

సంపూర్ణ పారిశుద్ధ్యమే లక్ష్యం

కార్వేటినగరం : సంపూర్ణ పారిశుద్ధ్యమే లక్ష్యంగా అధికారులు విధులు నిర్వహించాలని ఎంపీడీఓ చంద్రమౌళి పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని అమ్మపల్లి పంచాయతీలో చేపడుతున్న పారిశుద్ధ్య పనులను డీడీఓ జయప్రకాష్‌తో కలసి సందర్శించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ, ముస్లిం కాలనీల్లో పారిశుద్ధ్యం లోపించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. మండలంలో కురుస్తున్న వర్షాలను దృష్టిలో ఉంచుకుని మురుగునీరు వీధుల్లో ప్రవహించకుండా డ్రైనేజీల మరమ్మతులు చేపట్టాలన్నారు. వీధుల్లో ఉన్న పిచ్చిమొక్కలు, పేడ దిబ్బలను వెంటనే తొలగించాలన్నారు. నీటి ట్యాంకులను క్లోరినేషన్ చేయాలని, తాగునీటి పైపులైన్లను ఎప్పటికప్పుడు పరిశీలించి లీకేజీలను అరికట్టాల్సిన అవసరం ఉందన్నారు. వీధుల్లో చెత్త, పేడ దిబ్బలు వేయకుండా గ్రామాలకు దూరంగా నిల్వ చేసుకోవాలని ఆదేశించారు. పంచాయతీ కార్యదర్శులు సర్పంచ్‌లతో కలసి పంచాయతీ అభివృద్ధికి కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. అదే విధంగా మండలంలో అన్నూరు పంచాయతీలో నిర్వహించిన పారిశుద్ధ్య పనులను ఈఓ నాగరత్నమ్మతో కలసి పరిశీలించారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, మహిళా పోలీసులు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.


పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి


కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న ఏఐటీయూసీ నేతలు

నగరి : మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కమిషనర్‌కు ఏఐటీయూసీ నేతలు మంగళవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా చిత్తూరు జిల్లా ఏఐటీయూసీ గౌరవ అధ్యక్షుడు నాగరాజు మాట్లాడుతూ.. పారిశుద్ధ్య విభాగంలో పనిచేస్తున్న కార్మికులకు ఇప్పటి వరకు ప్రభుత్వం ప్రకటించిన సంక్రాంతి కానుక రూ.1000 ఇవ్వకపోవడం బాధాకరమన్నారు అలాగే కార్మికులకు యూనిఫాం, గుర్తింపు కార్డు, సోపులు, చెప్పులు, నూనె, రెయిన్ కోటు మంజూరు చేయకపోవడం శోచనీయమన్నారు. జిల్లాలోని అన్ని మున్సిపాలిటీలలో పారిశుద్ధ్య కార్మికులకు అవసరమైన వస్తువులు అందజేస్తున్నా నగరి మున్సిపాలిటీలో మాత్రం ఎందుకు ఇవ్వడం లేదని అధికారులను ప్రశ్నించారు. గతంలో ఉన్న అధికారులు పారిశుద్ధ్య కార్మికుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించారని ఆరోపించారు. సమస్యలు పరిష్కరించకుంటే డిసెంబర్ 5 నుంచి మున్సిపల్ కార్యాలయం ఎదుట దీక్షలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు వేలన్, షబీర్ బాష, శేఖర్ పాల్గొన్నారు.

అపార్ నమోదులో హెచ్‌ఎంలు చొరవ చూపాలి

కార్వేటినగరం : ఆధార్ కార్డుల్లో ఉన్న లోపాలను పరిష్కరించడమే అపార్ లక్ష్యమని ఎంఈఓ విజయకుమార్ అన్నారు. మంగళవారం మండల విద్యాశాఖ కార్యాలయంలో ‘అపార్’ పై పాఠశాలల హెచ్‌ఎంలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. నూతన విద్యా విధానంలో భాగంగా ఒకే దేశం, ఒకే స్టూడెంట్ పేరుతో తెచ్చిన ఆటోమేటెడ్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ (అపార్) నమోదు కార్యక్రమంలో హెచ్‌ఎంలు ప్రత్యేక చొరవ చూపాలని ఆదేశించారు. ప్రభుత్వం చేపడుతున్న అపార్ కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు ఇబ్బందులు పడకుండా ఉపాధ్యాయులు చొరవ చూపాలని కోరారు. విద్యార్థులకు అందించే ధ్రువ పత్రాల్లో పుట్టిన తేదీ వ్యత్యాసాలు, ఇంటి పేరు వంటివి పాఠశాల రికార్డు ప్రకారం ఉండేలా సరి చూసుకోవాలని ఎంఈఓ పేర్కొన్నారు. అనంతరం ఎంపీడీఓ చంద్రమౌళి మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన విధానాన్ని ప్రతి ఒక్కరూ పాటించి ఆధార్ కార్డుల్లోని లోపాలను సరిదిద్దుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ–2 మనోజ్‌కుమార్, పాఠశాలల హెచ్‌ఎంలు పాల్గొన్నారు.


హెచ్‌ఎంలకు అవగాహన కల్పిస్తున్న ఎంఈఓ విజయకుమార్

తిరుపతి గంగమ్మకు ప్రత్యేక పూజలు


ఆలయానికి పొంగళ్లు తీసుకెళ్తున్న మహిళలు

వెదురుకుప్పం : మండలంలోని పచ్చికాపల్లం పంచాయతీ దాసరి కాలనీలో నూతనంగా నిర్మించిన తిరుపతి గంగమ్మ ఆలయంలో మండల పూజలు వైభవంగా నిర్వహించారు. 41 రోజుల పాటు ప్రతి మంగళవారం అమ్మవారికి అంబలి పోసి పొంగళ్లు పెట్టి ప్రసాదాలను నైవేద్యంగా సమర్పించి విశేష పూజలు చేపట్టారు. ఈ క్రమంలో మంగళవారం గ్రామంలోని మహిళలు పెద్ద ఎత్తున పొంగళ్లు పెట్టి ప్రసాదాలను సమర్పించారు. అనంతరం యువత బాణసంచా కాల్చి సందడి చేశారు.

ఆయకట్టు రైతుల ఓటరు జాబితా ప్రదర్శన


ఓటరు జాబితాను చూపుతున్న రెవెన్యూ సిబ్బంది

పాలసముద్రం : మండలంలో తొమ్మిది చెరువుల ఆయకట్టు సంఘం ఎన్నికలు పారదర్శకంగా చేపట్టాలని తహసీల్దార్ అరుణకుమారి తెలిపారు. మంగళవారం శ్రీకావేరిరాజుపురం సచివాలయ ఆవరణలో వీఆర్‌ఓ రంగరాజ్, జూనియర్ అసిస్టెంట్ మునిరత్నం ఎస్‌కేఆర్ పురంలోని కొత్త చెరువు, పాత చెరువు ఆయకట్టు పరిధిలోని ఓటరు జాబితాను ప్రదర్శించారు. చెరువు ఆయకట్టు కింద వచ్చే ఓటర్లలో మృతి చెందిన వారి పేర్లు గుర్తించాలన్నారు. 23వ తేదీ జరగనున్న చెరువు ఆయకట్టు సంఘం ఎన్నికల్లో ఓటున్న రైతులు హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ మహేష్ బాబు, రైతులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలి

చిత్తూరు కలెక్టరేట్ : ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జీవీ రమణ కోరారు. ఈ మేరకు ఆ సంఘం నాయకులు సోమవారం డీఈఓ వరలక్ష్మిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఆయన డీఈఓతో మాట్లాడుతూ టీచర్ల సమగ్ర సీనియర్, రెగ్యులరైజేషన్ జాబితాలను డీఎస్సీల వారీగా, మార్కులు, మెరిట్ నెంబర్‌తో సహా ప్రకటించాలన్నారు. ఇటీవల సాధారణ ఎన్నికల సమయంలో వేసవి సెలవుల్లో శిక్షణ, డ్యూటీలు నిర్వహించిన టీచర్లకు సంపాదిత సెలవులు ఇవ్వాలని కోరారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో మున్సిపల్, కార్పొరేషన్, మున్సిపాలిటీల్లో ఉద్యోగోన్నతుల సీనియారిటీ జాబితాలు విడుదల చేయాలన్నారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సోమశేఖర్ నాయుడు, ఎస్ మణిగండన్ మాట్లాడుతూ వర్క్ అడ్జెస్ట్‌మెంట్‌లో జరిగిన తప్పిదాలను సవరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు రెడ్డెప్పనాయుడు, రెహానాబేగం , దీనాలి, ఎస్పీ భాషా, ఏకాంబరం తదితరులు పాల్గొన్నారు.


డీఈఓకు వినతిపత్రం అందజేస్తున్న యూటీఎఫ్ నాయకులు

యువతరంగ్ విజేతలకు అభినందన

వెదురుకుప్పం : తిరుపతి ఎస్వీ యూనివర్సిటీలో ఇటీవల నిర్వహించిన యువతరంగ్– 2024 పోటీల్లో చవటగుంట డాక్టర్ వైఎస్సార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు పాల్గొని విజేతలుగా నిలవడంపై ప్రిన్సిపల్ అన్నపూర్ణ శారద అభినందించారు. మంగళవారం మండలంలోని చవటగుంట డిగ్రీ కళాశాలలో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ అన్నపూర్ణశారద మాట్లాడుతూ.. డైరెక్టరేట్ ఆఫ్ స్టూడెంట్ వెల్ఫేర్ అండ్ కల్చరల్ అఫైర్స్ ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించారన్నారు. ఎస్వీయూ పరిధిలో 39 కళాశాలల నుంచి 430 మంది విద్యార్థులు పాల్గొన్నట్లు తెలిపారు. ఈ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి విజేతగా నిలిచిన విద్యార్థులను ఘనంగా సత్కరించారు. విద్యార్థులు అన్ని రంగాల్లో ప్రావీణ్యం సాధించాలన్నారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ మంగళగౌరి, అధ్యాపకులు భీమమోహనరావు, విద్యార్థులు పాల్గొన్నారు.


విద్యార్థులను ప్రశంసిస్తున్న ప్రిన్సిపల్ అన్నపూర్ణ శారద